# విడవని స్నేహితుడు

తోట వెంకటాద్రి

(నిర్జన ప్రదేశం. ఒక పాడుబడిన, బావి. బావి ఒడ్డున ఒక మనిషి.)

మనిషి: (నలుదిక్కులూ ఒకసారి బాగా పారజూసి) కనుచూపుమేరలో నరమానవు డెవ్వడూ కన్పడ్డంలా. ఇదే మంచి సమయం (అని బావిలో పడ్డానికి, చేతులెత్తి పూనిక చేస్తాడు.)

మనిషిలోని మనిషి: (తపిమని) ఆగు!

మనిషి: ఆగను,

మ. మ: ఆగు! కొంచెం నిదానించు!

మ: ఇక ఆగడం లేదు, నిదానించడం లేదు. మనిషన్నవాడు మళ్ళా కంటబడ్డాడా అంటే యీ పని గూడా సున్నా అవుతుంది. (అని మళ్ళీ పూనికచేస్తాడు.)

మ. మ: ఆగమంటే నీకే చెప్పేది! ఒక్క క్షణం ఆగు!

మ: ఒక్క క్షణం కాదుగదా అరక్షణం గూడా ఆగడానికి వీల్లేదు.

మ. మ: ఏమిటూ తొందర? నే చెప్పేది విను.

మ: ఆగను, ఆగదలుచుకో లేదు. నువు చెప్పేది వినవు. వినదలుచుకోలేదు. నన్ను వేధించకు. ఊరుకో యిక!

మ. మ: నిన్ను వేధించ దలుచుకో లేదు. అయితే ఒక్కమాట విను.

మ: వినను, వినను, వినను. ముమ్మాటికి వినను. ఇంతకాలం నీమాట వినే ఇంత తెచ్చుకొన్నాను. చెప్పి, చెప్పి నీకు విసుగు పుట్టడం లేదేమోకాని, వినీ విని నాకెప్పుడో విసుగెత్తింది! అయినా లేని ఓపిక తెచ్చుకొని విన్నాను. ఇప్పుడు వినను. పోతాను.

మ. మ: అంటే, యెక్కడికి?

మ: అంటేనా? చచ్చిపోతాను. చిట్టచివరకు ప్రతి జీవీ వెళ్ళేచోటికి నేనిప్పుడే పోతాను.

మ. మ: ఏమిటూ ప్రతి జీవీ వెళ్ళేచోటు?

మ: మరణదేవత లోకం. ఈ మానవ లోకంలో ఉండదలుచుకో లేదు, ఉండలేను, ఉండను. పోతాను. అడ్డురాకు నువ్వింక. (అంటూ మళ్ళొకసారి బావిలో దూకడానికి పూనికచేస్తాడు.)

మ. మ: (వెంటనే) ఆగాలి! నే చెప్పేది వినాలి!

మ: అబ్బబ్బ! నన్ను చంపెయ్యకు! నీమాట, నీ సలహా వినే కొంప నిలువునా ఆర్చుకొన్నాను. నువ్వు లేకపోయినా ఈ జీవితానికి ఓ రకమైన సుఖం దొరికేదేమో! మనిషినై యెందుకు పుట్టేనా అని విచారిస్తున్నాను. ఆ చెట్టు చూడు! ఫలపుష్ప సంభరితంగా యీ మందమారుతంలో హాయిగా ఊగుతూ, నన్ను జూచి నవ్వి వెక్కిరిస్తూంది. ఆ పిట్ట చూడు! ఆ కొమ్మలమీద, ఆ పచ్చటి ఆకులమధ్య కూర్చొని, ఎంత స్వేచ్ఛగా సంగీతం పాడుతూందో! అది నాదుర్భరజీవితాన్ని చూచే, ఎగతాళి చేస్తూంది. మానవసమాజంచేత నిర్దయగా విడనాడబడ్డ నేను, జంతుజాలంచేతగూడా పరిహసింపబడ్డం! ఆశ్చర్యం. సరే! అన్నిటినీ యిప్పుడే వదిలించుకొని పోతాను. సరే!

మ. మ: సరే, జంతుజాలం నీ దుర్దశను గాంచి నవ్వడం లేదు. నీ యీ తెలివితక్కువతనానికి హేళనచేస్తున్నట్లున్నాయి.

మ: ఆ! అట్లాగా! నా తెలివి తక్కువతనానికి నన్నవి హేళన చేస్తున్నాయా! నేను తెలివి తక్కువవాణ్ణా! కాదు! యెప్పటికీ కాదు. డబుల్ గ్రాడ్యుయేట్ను నేను. నా బంధుమిత్రాదులూ, తోడి విద్యార్థులంతా అదిరిపొయ్యేటట్టు బీ. కాం., బి. ఎల్., ఢంకామీద దెబ్బకొట్టి ప్యాసయినవాణ్ణి నేను. నేను తెలివి తక్కువ వాణ్ణి యెట్లా అయ్యాను? ముమ్మాటికీ కాదు.

మ. మ: రా చెబుతా! ఆ చెట్టునీడన చతికిల బడు. ఎట్లాగో చెబుతా!

మ: చెబుతావా? యేం చెబుతావ్? — ఛీ! మారి పోతున్నాను. నా ఉక్కు సంకల్పం నుండి దూరమవుతున్నాను. ఇదుగో! యిక నాకు నువ్వేమీ చెప్పొద్దు. వినను. ఊరుకో అట్లా. మళ్ళీ నీ మాట గనక వింటే...

మ. మ: వింటే ఏమవుతుందేమిటి?

మ: యిదివరకు యేమయిందో యిప్పుడూ అదే అవుతుంది. అంతకంటే అధ్వాన్నంగా కూడా కావచ్చు. పదివేలు కట్నం వచ్చివుండేది పక్కింటివారి పడుచును పరిణయ మాడినట్లయితే. వారి ప్రాపకాన ఇంత ఉద్యోగంకూడా దొరికేది. అప్పుడు నువ్వు ఆ పెండ్లి వద్దన్నావు. ప్రేమించిన పిల్లనే చేసుకోమని నా దుంప తెంచావు. యేవేవో వందల కొలదిగా, ఆదర్శాలూ, ఆశయాలూ, నీతులూ, ఉన్నత భావాలూ అంటూ బోధించావు. అవే నా కొంప నిష్కారణంగా ఆర్పినై. నా సర్వ నాశనానికి అవే దారి సరిచేసినై.

మ. మ: అట్లాగా?

మ: అట్లాగాక యింకెట్లా? పెళ్ళాం బిడ్డలు నాతో సహా, ఆకలి మంటకు అల్లాడి పోతున్నారు. ప్రాక్టీసు పెట్టి సంపాయించడానికి చేతులో చిల్లిగవ్వ లేదు. యెక్కడైనా థర్డ్ గ్రేడు గుమస్తాగిరి దొరుకుతుందేమోనని. చచ్చేట్టు ప్రయత్నించినా లాభం లేకపోయింది. యింట్లో దరిద్రదేవత కొలువుదీర్చి కూర్చుంది. పెళ్ళాం, బిడ్డలు, తమ్ము పోషించలేని నా అసహాయతకు నడపీనుగనంటూ నన్ను నిందించుతారని అనుమానం గూడా పడ్డాను. పెళ్ళాం బిడ్డలకు తిండి పెట్టలేనివాడు ప్రపంచంలో ఉన్నాడా అనేది ఆర్యోక్తి. యేం చేయను? యేం తోచలా. దొంగతనం చేద్దామనిపించింది. ఛీ వద్దన్నావు నువ్వు. యేం దొంగతనం చేస్తే? లక్షలాది బీదప్రజల కడుపులుకొట్టి, బొక్కసాలు నింపుకున్న వాళ్ళిళ్ళల్లో, కూటికిలేని నా బోటి అభాగ్య జీవి ఒకడు న్యాయంగా దొంగతనంచేసి వందరూపాయలు తెచ్చుకొని ఒక నెల రోజులు గడుపుకుంటే తప్పొచ్చిందా? న్యాయంగా మొరబెట్టుకుంటే వినరేం మరివీళ్లు? వాళ్ళకు తెలియదూ నా స్థితి యెటువంటిదో?

మ. మ: దొంగతనం సభ్యతకు విరుద్ధమైన పని. నీబోటిగాడు ఆకలి మంటకు తట్టుకోలేక న్యాయంగా దొంగతనం చేసినా, దూరదృష్టి గల వాడెవ్వడూ తప్పని భావించడు. అయితే ఉన్నవాడూ, లేనివాడూ అంతా కలిసి, అదే పనిగా, అదే కారణంతో, అదే పనిచేయడం మొదలుబెడితే యెట్లా ఉంటుందో ఆలోచించమన్నాను.

మ: అవును! నే నేమన్నా యేసుక్రీస్తునా, గాంధీగార్నా? ఆ సహనం, ఆ నిగ్రహం అవి నా కెక్కడుంటాయి? లెక్కలో లేని ఒక సాధారణ మానవుణ్ణి నేను. అయినా ఊరుకున్నాను. ఓర్చుకున్నాను. నువ్విచ్చిన సలహాను పాటించాను. ఛీ ఆ పని వద్దనుకున్నాను. తిరిగాను కొన్ని రోజులు పొట్ట చేత బట్టుకొని. కొన్ని రోజులు సినిమాలలో శవాలను మోశాను. తరవాత ఒక ఫ్యాక్టరీలో కార్మికుడిగా కుదిరాను. ఎముకలు విరగగొట్టుకొని పనిచేశాను. వచ్చే జీతంలో పిల్లలకు బెట్టి మేం పచ్చి నీళ్లు తాగిన రోజులు చాలా ఉన్నై. జీతం ఎక్కువ కావాలని కార్మికులు సమ్మెచేశారు. నేనందులో పాల్గొన దలచుకోలేదు మొదట్లో. అయితే నువ్వూరుకుంటేనా! పాల్గొన్నాను. నీ ఒత్తిడి భరించలేక విఫలంగాబోయే సమ్మెకు నాయకత్వం గూడా వహించాను. ఫలితం: కొన్ని రోజులకు ఉద్యోగం ఊడి ఊరుకుంది. మళ్ళీ నా బతుకు బజారున పడింది. యేమిరా అంటూ, చివరకు సానుభూతి చూపించే వాడు కూడా లేకపోయాడు. పెళ్ళాం మనోవ్యాధితో మంచం యెక్కింది పిల్లలు యేడుస్తుంటే వాళ్ల కళ్లల్లోకి నీళ్లుగూడా రావడంలేదు. ఇక లాభం లేదనుకొన్నాను. వచ్చేశాను.

మ. మ: నువ్వుచేసిన పనులన్నీ న్యాయసమ్మతాలూ, స్వార్థరాహిత్యాలూ, ధర్మభూయిష్టాలూ, పరోపకారకరాలూ, త్యాగమయాలూ.

మ: అట్లా అనుకొని లేని సంతోషం తెచ్చుకొని తృప్తి పడ్డాల్సిందేనా? అయితే యెవడు సంతోషించాడు? నా కొరిగిందేమిటి? నువ్వు చెప్పినట్లు అట్లా ఒకసారి స్మరించుకొని సంతృప్తి పడితే తిండెక్కణ్ణుంచొస్తుంది?

మ. మ: నీ జీవితం సమాజానికి ఆదర్శంగా ఉండాలి. తానవలంబిస్తున్న సద్విధానాలకు విరుద్ధంగా ఉండకుండా ఉండాలి.

మ: నాకు తెలుసు అట్లా ఉండాలని. ఇన్ని రోజుల్నుంచీ, నేను నమ్మిన విధానాలకూ, విధులకూ విరుద్ధం కాకుండానే నెట్టుకొచ్చాను మరి. ఇవన్నీ తిండి ఉన్నప్పటి మాటలు. కడుపులో చల్ల కదలకుండా ఉన్నప్పుడే అనేక భావాలూ, అనేక ఆదర్శాలూ, అనేక నీతులున్నూ. అది లేనినాడు యేమీలేవు, ఘోరమైన నైతిక పతనం తప్ప. మనం చూస్తున్న యీ బిచ్చగాళ్ళూ, యీ వ్యభిచారం, యీ దొంగతనాలూ, యీ జాడ్యాలూ – యివన్నీ యెట్లా పుట్టుకొచ్చాయి? కొంతవరకు అజ్ఞానం, సోమరితనం, కారణంగావచ్చు. కాని ముఖ్య కారణం తిండి లేకపోవడమే నంటాను. 'క్షుధాతురాణాం నభయం నలజ్జా ఉదరపోషణార్థం బహు కృతవేషం.'

మ. మ: తిండి ఊరకనే వస్తుందా మరి?

మ: నాకెప్పుడో తెలిసింది తిండి ఊరకే రాదని. మా అమ్మగూడా నేను యేడ్చిందాకా పాలిచ్చేదిగాదు. తిండి ఊరకే వస్తుందని నేను కలలోగూడా అనుకోలేదు. నవ్వు తాలకైనా యెవ్వరితో అనాలేదు. తిండి కావాలంటే పనిచేయాలి. పని చేయనిది తిండి రాదు. 'కోటి విద్యలు కూటి కొరకే. నేను కష్టపడి యెక్కువ చదువు చదివింది గూడా నాలుగురాళ్లు అధనంగా దొరుకుతాయనే. అయితే చేసేందుకు పనేదీ? నేను పని చేయనన్నానా? నువ్వన్నట్లు, సభ్యతకు విరుద్ధమైన పనులు మినహాయించి, అనుకూలమైన పనులన్నీ చేయలేదా? నీఅభిప్రాయం, తిండిగదా నీక్కావాల్సింది, యేపనైనా సరే చేయమనా?

మ. మ: యెప్పటికీ అట్లాకాదు. యెట్టి పరిస్థితుల్లోనూ, మనం పెట్టుకున్న ఆదర్శాలను విడవకూడదు.

మ: బాగాచెప్పావు. అయితే ఆదర్శాలను విడవకుండా అట్లాగే పెట్టుకుని తిండిలేకుండా ప్రాణం వదిలేదా? రెండూ కావాలంటే కుదరడం లేదుగా! అందుకనే వచ్చేశానిక్కడికి. సరే, ఒకమాట: నాచేతనైన పని చేయించుకోడం, ఆ పనికి తగినట్లు నా జీవితావసరాలను తీర్చడం సమాజం యొక్క బాధ్యత కాదా? చేతనైనపని చేయడం, నాపనికి తగినట్లుగా నా జీవితావసరాలను తీర్చుకోడం నావంతు కాదా? పుట్టినందుకు, నా తుట్టతుది హక్కైన మరణం వరకూ జీవించడం నా హక్కుగాదా? అయితే తిండికీ బట్టకూ మొహంవాస్తూ కాదు జీవించేది. తిండీ బట్టా ఊరికేవచ్చి పడవని మళ్లీ అంటున్నాను. వాటికోసం పనిచేయడానికి యెల్లవేళలా సిద్ధమేనంటున్నాను. సమాజం తనబాధ్యతలను కేర్లెస్‌గా మరిచిపోయింది. నన్ను అన్‌క్లెయిమ్ చేసింది. తిండిలేకుండా, కృశించి, ఘోరావమానంతో చావడం కంటే, ఒక్కసారి యే బావిలోనో పడి చస్తే మేలని యీ బావిదగ్గరకొచ్చాను. చిట్టచివరకు, నా మొరాలకించి, నన్నొక దరిచేర్చేది యీ బావే ననుకుంటూ.

మ. మ: నువ్వు చెప్పిందంతా వింటూంటే నువ్వు కేవలం తిండికోసమే పుట్టావని అనుకోవలసి వస్తుంది.

మ. చంపేశావ్! నేను తిండికోసం పుట్టేనా లేక తిండి నాకోసమే పుట్టిందా? బహుశా యిద్దరం ఒకేసారి పుట్టాం. నేను లేకపోతే అదిలేదు. అదిలేకపోతే నేనులేను. అయితే న్యాయంగా నాకు రావాలసిన తిండిని యేవో గద్దలొచ్చి తన్నుకుపోతున్నాయి. చెప్తాను, కొంచెం ఉండు (అని ఒక నిట్టూర్పు విడుస్తాడు శబ్దంచేస్తూ.)

మ. మ: సరే, చెబుదువుగాని, ఆ చెట్టుకింద కూర్చుందువుగాని పద కాస్సేపు.

మ: కూర్చోనా? మళ్లీ! ప్చ్!- కూర్చుంటాను. చెట్టుకిందెందుకు? ఈ బండ చాలు. (అని బావి ఒడ్డున ఉన్న బండమీద కూర్చుని) బ్రతకడం తిండికోసమా లేక తిండే బ్రతకడంకోసమా? దాదాపు రెండింటికీ ఒకటే జవాబు. బ్రతకడం తిండికోసమా అంటే బ్రతకడానికి తిండి తప్పనిసరి అవుతుంది. తల్లి గర్భంలోంచి భూమ్మీదపడిన మరుక్షణం నుంచే ప్రతి ప్రాణి తిండికోసం పడే ఆరాటం యింతింతగాదు. ఈ 84 లక్షల జీవరాసులూ సాధారణంగా తిండి సంపాయించుకోవడంలోనే నిమగ్నమై

ఉన్నాయి. తిండికోసం, దాన్ని యెంత సులభంగాబడితే అంత సులభంగా పొందడంకోసం, జరిగిన యీ యెడతెగని ఆలోచనలూ, ఉపాయాలూ, యత్నాలూ, పోరాటాలూ- వీటివల్లనే అసలు మానవుడి విజ్ఞానమన్నది పుట్టుకొచ్చింది మొదట్లో. వెనక పీకుడు లేకుండా, కడుపునిండా తిండి దొరికితేనే, పాట పాడ్డంగానీ, పద్యం రాయడంగానీ, బొమ్మ గీయడం గానీ, షికారు కొట్టడంగానీ. రసోత్పత్తికి తిండే మూలకారణం. పొట్టకు మేతలేకపోతే మెదడుకు మేతలేదు. మెదడుకు మేత లేకపోతే, నూతన వస్తు, నూతన విషయ ఆవిష్కరణ లేదు. ఆరోగ్యం కొరవడితే జీవితానందం లేదు. మంచి ఆరోగ్యం రావాలంటే, మంచి తిండి కావాలి. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అంటే దాని విలువ, దాని అవసరం యెటువంటిదో తెలుస్తుంది. కాబట్టి బ్రతకడానికి ఓం ప్రథమావసరం తిండి. ఆ బ్రతుకువల్ల ఏమయినా లాభం ఉన్నదీ, లేనిదీ తరవాత విషయం. సర్వసాధారణంగా ప్రతి ఒక్కడివల్లా యేదో ఒక లాభం ఉంటూనే ఉంటుంది సమాజానికి. కనీసం వాడు, జనన మరణ లెక్కలకైనా, జనసంఖ్యకైనా, ఓటర్ల జాబితాలకైనా, తుపాకి తిండికైనా ఉపయోగిస్తాడు. ఈ పనులు నెరవేర్చడానికైనా సరే, వాడికి తిండి అవసరం కాదా? కాబట్టి నేను బతకాలి. ఏదో విధంగా సమాజానికుపయోగపడాలి. ఎట్లా సమకూరుతై యీ పనులు? తిండివల్ల. ఆతిండి నాకులేదు. దాన్ని సంపాయించాలని, భగీరథుడిలాగ, రాబర్టు బ్రూసులాగ పోరాడినా, నాకది లభ్యంగావడంలేదు. నాకు విరక్తి పుట్టుకొచ్చింది. చావడానికొచ్చాను.

మ. మ: భేషయిన పనిచేశావ్. అడవికన్నా వెళ్ళకపొయ్యావా? ఆధ్యాత్మిక రంగంలోనైనా ప్రకాశించేవాడివి.

మ: అనుకొన్నాను మొన్ననే పోదామని. తీరా ఆలోచిస్తే అందులో నాకేమీ లాభం లేనట్లు కనపడింది. దేహాన్ని శుష్కింపజేసుకుని, తపస్సుచేసి, యేదో జ్ఞానోపార్జన చేశానని డాబులు కొడుతూ, బూజుపట్టిన పాత సిద్ధాంతాలను, కొత్తమాటల్లో చెప్పడం నాకిష్టంలేదు. అదివట్టి డాగ్మాటిజం కిందికి వస్తుందన్నావు మొన్నొకసారినువ్వు. నేను భౌతికవాదిని. "మార్క్స్ సిద్ధాంతాలలోనూ, మనుష్య ప్రయత్నంలోనూ" నాకు నమ్మకం ఉంది మొన్నటిదాకా.

మ. మ: యిప్పుడా నమ్మకం సడలిపోయిందన్నమాట.

మ: అవును. నా మెదడును బాగా ఉపయోగించి, విజ్ఞానాభివృద్ధిచేయడానికినా నిత్య జీవితావసరాలు తృప్తికరంగా ఉండితీరాలి. జీవితమంతా జీవితాన్ని నిలబెట్టుకోడానికే పోరాడుతూ ఉంటే యిక విజ్ఞాన రంగంలో వెలగబెట్టేదేముంది? "మరణ భయంబు నాకు నిసుమంతయులేదు, మదీయ జీవ సంభరణ భయంబె యెక్కువ" అని పలికాడు ఉమర్ ఖయాము. ఈ జీవసంభరణ భయంగూడా నా కుండ గూడదంటాను. కనీసం, నా ఆయువు దానంతటది మూడిందాకానైనా, నేను బతకడానికి నాకు తిండి కావాలి. నేను పుట్టి సమాజావసరాన్ని తీర్చాను. సమాజం నా అవసరాన్ని తీర్చి మళ్ళీ నాచేత తన అవసరాలను తీర్పించుకోవాలి. ఇది సహజంగదూ? నేను సమాజాన్ని పట్టుకొని యెంత ప్రాకులాడినా నన్నది కాలుతోతన్ని తరిమేస్తూంది. ఈ పరాభవాన్ని భరించలేను. యిక నువ్వెన్ని చెప్పినా లాభంలేదు. చచ్చిపోతాను.

మ. మ: చచ్చిపోయి యేంచేస్తావ్?

మ: మరణదేవత లోకానికి పోతాను. ఆ లోకంలో బీదవాడూ, భాగ్యవంతుడూ అనే భేదంలేదు. అక్కడ సర్వులూ సమానులే. "సర్వమానవ సౌభ్రాతృత్వం, విశ్వమానవ కల్యాణం" అక్షరాలా అమలు జరుగేది ఆ లోకంలోనే. అసలీ మహాదాదర్శాలను పధ్నాలుగు లోకాలకు చాటింది ఓం ప్రథమంగా మరణ దేవతే ననుకుంటాను. ఈ అన్యాయం, యీ అక్రమం, యీ క్రౌర్యం, యీ దౌర్జన్యం, యీ మోసం, యీ స్వార్థం ఆ లోకంలో లేవు. నాబోటి పతితులకు సంపూర్ణ శాంతి లభించేది ఆ లోకంలోనే. అందుకనే యెంత త్వరగాబడితే అంత త్వరగా అక్కడికి పోవ

డానికి ఆతురతపడుతున్నాను. నా యీఆశయ సిద్ధికి, యీ పాడుబడిన బావిమహా సాధనంగా దొరికింది సెలవు.

మ. మ: ఆగు! ఒక్క విషయం.

మ: ఆ! యింకా ఆగేదా? యింతసేపు మొత్తుకొన్నా యింకా నువ్వు కన్విన్సు కాలేదా!

మ. మ: నిదానించి నేను చెప్పేది విను. నువు చచ్చింతర్వాత మరణదేవత లోకానికి పోతావుకదూ!

మ: అవును.

మ. మ: ఆ లోకంలో సర్వ సమానత్వం అమల్లో ఉంది. అందరకూ పనీ, తిండీ, బట్టా వగైరా ఉంటాయనీ-జీవితం సుఖప్రదంగా ఉంటుందనీ ఊహించుకుంటున్నావు కదూ?

మ: అవును

మ. మ: అయితే నీ ఊహా ప్రపంచంలోని సమాజ వ్యవస్థను యీ వాస్తవిక ప్రపంచంలో నెలకొల్పడానికి యెందుకు ప్రయత్నించవ్?

మ: ఆ!

మ. మ: అవును.

మ: యీ ప్రపంచంలోనా!

మ. మ: అవును.

మ: నేనా! ప్రయత్నించనా!

మ. మ: అవును. భగ్నహృదయుడవై, నిరాశతో బలవంతంగా నీ నిండు ప్రాణాలు తీసుకున్నందువల్ల కలిగే ప్రయోజనం యేమిటి?

మ: యీ బాధలనుండి విముక్తి కలుగుతుంది.

మ. మ: సరే! నువ్వు యీ వేళ గాకపోయినా రేపయినా చచ్చేవాడివే. తిండి ఉన్నా సరే, లేకున్నా సరే, నీ కాలం వచ్చిందంటే ఆగమన్నా ఆగకుండా పోతావు. అయితే యీ బాధలేమిటో, వీటికిగల మూల కారణాలేమిటో గ్రహించి, వాటిని తొలగించడానికి చేసే పనుల్లోనే మరణించ గూడదూ? యిట్లా యీ వ్యర్థ మరణం పొందడంకంటే, నీకూ, నీ సమాజానికీ పనికొచ్చే యేదోఒక పని చేస్తూ మరణించు. యేం?

మ: ఆ! (మనస్సు మహా కల్లోలం అవుతుంది.)

మ. మ. అవును. మళ్లీ యింకోసారి చెప్పమన్నావా?

మ: నువ్వేదో నన్నింకా చేయమంటున్నావ్. చచ్చిపోయిన ఆశను, ఆదర్శాన్ని రేకెత్తిస్తున్నావ్. నాకయోమయంగా ఉంది.

మ. మ: "ఆశాకిరణమె ఆత్మకు జ్యోతి" ఆ ఆశ మంచి ఆదర్శయుక్తమై ఉండాలి. అంతా నీబోటి నిరాశావాదులుగా తయారైతే, అందరూ ఆత్మహత్యలు చేసుకోడానికి తల పడితే, ప్రపంచం మరోలాగు నడుచుకొచ్చేది. నాలుగురోజులు పొట్టకు లేకపొయ్యే సరికి, బ్రహ్మప్రళయం ముంచుకొచ్చినట్లు అర్థంలేని, అనర్థకమైన సాహసం చేయసమకట్టావు. అటు చూడు! నీలాంటి, "నిర్భాగ్య, నిరీహ, నిర్బల, నిరుద్యోగప్రజ" లెంతమందున్నారో! లక్షలు! కోట్లు! లే. పో యిక్కణ్ణుంచి. నీతోడి మానవుల్తో కలువు.

మ: (మౌనం.)

మ. మ: సర్వమానవ సౌభ్రాతృత్వం, విశ్వమానవ కల్యాణం, "ఒకే శాంతి, ఒకే కాంతి" యివే నీ ఆదర్శాలుగా పెట్టుకో! నీ ఆశయ సిద్ధికోసం పోరాడుతూ మరణించు.

మ: అంతేనంటావా?

మ. మ: అంతే! అందులో యేం అనుమానంలేదు. ఈ బాధలను, ఈ సమాజారిష్టాలను రూపుమాపడానికి జరుగుతున్న పోరాటమే, సమాజాన్ని ఒక్కొక వ్యవస్థను దాటించుకుంటూ, యీ వ్యవస్థలోనికి తెచ్చాయి. ఈ ప్రస్తుత వ్యవస్థలో గూడా పనీ, తిండీ, బట్టా— వీటికోసం పోరాటం నిరంతరం జరుగుతూనే ఉంది. ఈ పోరాటం సమాజాన్ని ప్రస్తుత దశలోంచి పెకల్చివేసి, ఇంకో దశలోకి తీసుకుపోతుంది. ఇది సహజపరిణామం. అందరికీ పనీ, తిండీ, బట్టా దొరికే వ్యవస్థకోసం నీబోటి గాళ్ళంతా నడుం బిగించాలి, పోరాడాలి.

మ: అయితే పొమ్మంటావా వెనక్కు?

మ. మ: పో! నువ్విప్పుడు చావకూడదు. చావడానికి వీల్లేదు. పో! సమాజాన్ని బాగా అర్థం చేసుకో! దానిలోని హెచ్చు తగ్గులకు గల కారణాలను గ్రహించు. వాటిని పరిమార్చడానికి పరిష్కారమార్గం అన్వేషించు.

పోరాడు. ఆ పోరాటంలో చచ్చావా నీపేరు చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖింపబడి, ఆచంద్రతారార్కం ఉంటుంది. నీ పోరాట ఫలితాన్ని నీ ముందు సంతతి అనుభవిస్తుంది.

మ: నా రక్తమాంసాలను పునాదిగా చేసుకుని నిర్మించిన సమాజవ్యవస్థ నాముందు తరాల వాళ్ళను సుఖపెడుతుందా? నాపని యిట్లా చావడమేనా?

మ. మ: మళ్ళీ వెనక్కు పోతున్నావ్! అది నీ బాధ్యత. మానవుడి బాధ్యత అది. విశ్వాసమే మానవుణ్ణి కార్యశూరుణ్ణి చేస్తుంది. నిన్ను నీవు విశ్వసించు. నీ ఆదర్శాలను విశ్వసించు. నీ పనులను విశ్వసించు. నిరాశపొందడం అసమర్థుడి పని.

మ: నాకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నావ్ మళ్లీ!

మ. మ: శాంతి! శాంతి! ఎక్కడుంది శాంతి? నీ చేతుల్లోనే ఉంది శాంతిని సంపాయించుకోవడం, లేక నీ మనస్సును కల్లోల పరచుకోవడం. యెట్టి పరిస్థితుల్లోనూ మనో నిబ్బరమే నిజమైన శాంతి. నీ జీవితం పీడిత ప్రజోద్ధరణకు సంపూర్తిగా వినియోగపడుతుంది అన్న తలంపు కలిగినప్పుడే నీకు నిజమైన శాంతి. నీవు మరణించేటప్పుడు, నీ జీవితం యావత్తూ పీడిత ప్రజోద్ధరణకు వినియోగపడిందనే మహాసంతృప్తి కలిగినప్పుడే నీకు నిజమైన శాంతి. అందరికీ తిండీ, బట్టా దొరికి, సుఖమయజీవితం చేస్తున్నప్పుడే యీ ప్రపంచంలో నిజమైన శాంతి. తిండికోసం పోరాడడం అంటే శాంతికోసం పోరాడడమన్న మాటే. పో ఇక. ఒక్కక్షణం వృధాగా పోనీయవద్దు.

మ: పోతాను.

మ. మ: పో! పరుగెత్తు. నీ తోడి మానవుల కష్టసుఖాల్లో పాలు పంచుకో! నువ్వే ప్రజ, ప్రజే నువ్వు. నీ శక్తి అనంతం.

మ: అవును! నాశక్తి అనంతం, అవినాశం, అమోఘం, అత్యున్నతం. పోతాను. పోతున్నాను. సమాజంలోని అసమానత్వాన్ని చీల్చి చెండాడుతాను. అందరికీ తిండీ, బట్టా దొరికేట్టు చేయడానికి నా జీవితాన్నే ఒడ్డుతాను. నిజమైన శాంతిని స్థాపిస్తాను. (అంటూ పోతాడు.)

# 'సర్వాంతర్యామి' బిరుదు మార్పు

మన్నవ గిరిధరరావు

ఉదయం దినచర్య కుపక్రమించింది మొదలు రాత్రిపూట దోమతెర మరుగున నడుము వాల్చేవరకు రక్షక భటుని మోస్తరుగా అడ్వర్టయిజ్మెంట్లు వెంటపడుతూనే వుంటాయి. కిటికీలో గుండా వచ్చే సూర్యకిరణాల సూదుల బాధ భరించలేక పక్కమీదనుంచి లేచేసరికి "జైహింద్ బ్లేడుతో సున్నితమైన క్షవరము పొందుడు" అని క్యాలండర్ మీద ప్రకటన చూసి వెంటనే తత్సంబంధమయిన సరంజామా అంతా తీసుకొని గడ్డం గీకడం ఆరంభించానను కోండి. గడ్డంమీద అక్కడక్కడ గాట్లుపడ్డ విషయం మీకు చెప్పకుండా దాచటం అంత మంచిదికాదు. ఎందువల్లనంటారా? అప్పుడే తయారయిన ప్లాంటర్స్ కాఫీ చప్పరిస్తూ చప్పరిస్తూ వుండగా కిటికీలోగుండా "ఆంధ్రప్రభ" లోపలికి దూకించ బడటం జరిగింది. తాగేతాగే కాఫీ అలా బల్లమీద పెట్టి పత్రిక మీదికి దృష్టి సారించాను. "కొరియాలో చైనా దురాక్రమణ జరిపిందని మిత్రరాజ్య సమితి నిర్ణయం" అనేవార్త కంటికి తగిలింది. ఆవార్తకు క్రిందనే "అన్నిరకముల గాయములకు, మొటిమలకు-"మలామా" శ్రేష్టమైనది" అనే ప్రకటన కనపడింది. కొరియాపై చైనా జరిపిన దురాక్రమణ కంటే నా గడ్డంమీద జైహింద్ బ్లేడు చేసిన "దౌర్జన్యమే" మిక్కుటమవటంవలననూ రక్తం ప్రవహించ నున్నట్లుగా చేతిలోని అద్దం